మలేరియా నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ

- అప్రమత్తమైన వైద్యారోగ్యశాఖ అధికారులు
- విస్తృతంగా మలేరియా వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమాలు



బండారులంకలో మలేరియా వ్యతిరేక ర్యాలీ చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది



కొంకాపల్లి వసతి గృహంలో దోమల మందు పిచికారీ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

అమలాపురం రూరల్: నిన్న మొన్నటి వరకూ భానుడు భగ్గుమన్నాడు. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు పడుతున్నాయి. దీంతో దోమల తీవ్రత సైతం పెరుగుతోంది. వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. అందుకే వైద్యారోగ్య శాఖ అధికారులు అప్రమత్తమై మలేరియా నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. ప్రజల్లో అవగాహన కల్పించడానికి మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 1వ తేదీన ప్రారంభమైన మాసోత్సవాలు 30వ తేదీ వరకూ జరగనున్నాయి. ప్రధానంగా అమలాపురం ఏరియా ఆసుపత్రితో పాటు నియోజకవర్గంలోని 10 పీహెచ్‌సీల పరిధిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత

అనాఫిలస్ అనే ఆడ దోమ కుట్టడం వల్ల మలేరియా సోకుతుంది. దోమ కాటుకు గురైన వ్యక్తికి 10 నుంచి 15 రోజుల్లో వణుకు, వాంతులతో కూడిన చలి జ్వరం వస్తుంది. రెండు రోజులకోసారి జ్వరం రావడం, రాత్రి సమయంలో ఎక్కువగా ఉండడం మలేరియా లక్షణం. సాధారణ జ్వరంగా భావించి మందులు వేసుకున్నా మూడు గంటల్లో మళ్లీ జ్వరం లక్షణాలు కనిపిస్తాయి. మలేరియాకు ప్రాథమిక దశలోనే చికిత్సను ప్రారంభించాలి. తీవ్రత పెరిగితే మెదడు, మూత్రపిండాలు, కాలేయం దెబ్బ తింటాయి. సెరిబ్రల్ మలేరియా అత్యంత ప్రమాదకరం. అయితే దోమలు ప్రబలడానికి ప్రధాన కారణం క్షేత్ర స్థాయిలోని అపారిశుధ్య పరిస్థితులే అనడంలో ఎలాంటి సందేహం లేదు. పంచాయతీ పారిశుధ్య కార్మికులు అవసరానికి తగినంత మంది లేకపోవడంతో వర్షాలు పడినప్పుడు డ్రెయిన్లను శుభ్రపరచడం సమస్యగా మారుతుంది. అందుకే సీజనల్ వ్యాధుల ప్రబలే అవకాశమున్న నేపథ్యంలో తమ చుట్టుపక్కల పరిశుభ్రంగా ఉంచుకునే బాధ్యత ప్రతిఒక్కరూ చేపట్టాలి.

విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు

అమలాపురం మండలంలో బండారులంక, పేరూరు పీహెచ్‌సీలు, అల్లవరం మండలంలో అల్లవరం సీహెచ్‌సీ, బెండమూర్లంక, గోడిలంక పీహెచ్‌సీలు, ఉప్పలగుప్తం మండలంలో ఉప్పలగుప్తం, భీమనపల్లి, ఎస్.యానం పీహెచ్‌సీలు, అమలాపురం ఏరియా ఆసుపత్రి, చల్లవారివీధి అర్బన్ హెల్త్ సెంటర్, మున్సిపల్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో వైద్యారోగ్య అధికారులు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలని సూచిస్తున్నారు. కనీసం వారంలో ఒక రోజు నివాస ప్రాంతాలను పొడిగా ఉంచడం ద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టాలన్నది ఈ కార్యక్రమ ఉద్దేశం. అంతేకాకుండా మలేరియా వ్యతిరేక మాసోత్సవాల పేరుతో పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



మలేరియా వ్యాధి అనాఫిలస్ అనే ఆడ దోమ కుట్టడం వల్ల వ్యాప్తి చెందుతుంది. సీజన్ మారుతున్న నేపథ్యంలో దోమలు పెరగకుండా ప్రజలంతా పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. ఎవరికైనా ఈ వ్యాధి లక్షణాలు కనిపిస్తే ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.

– డాక్టర్ వాసు నాయక్, వైద్యాధికారి, బండారులంక

క్లుప్తంగా

ఘనంగా చండీ హోమం



చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో శనివారం చండీ హోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చక స్వామి పేటేటి శ్యామల కుమార్ ఆధ్వర్యంలో పౌర్ణమి తిథిని పురస్కరించుకుని పలువురు పండితులచే భద్రకాళి అమ్మవారికి గణపతి పూజ, పుణ్యాహవచనం, చండీ పారాయణ, చండీ హోమం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

నేడు సత్తెమ్మ తల్లి తీర్థం



పేరూరు దాన సత్తెమ్మ తల్లి అమ్మవారు

అమలాపురం రూరల్: మండలంలోని పేరూరు గ్రామదేవత దాన సత్తెమ్మ తల్లి అమ్మవారి తీర్థ మహోత్సవాలకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి అమ్మవారిని పుట్టిన ఇంటి నుంచి అత్తవారింటికి సాగనంపే కార్యక్రమం నిర్వహిస్తారు. రెండేళ్లకోసారి జరిగే తీర్థ మహోత్సవాలను పేరూరు ఆడ పడుచులు, గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించుకుంటారు.

ఎంపీడీఓకు వినతి పత్రం అందజేత



ఎంపీడీఓ వెంకటేశ్వర ప్రసాద్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎస్.కొత్తపల్లి గ్రామస్తులు

ఉప్పలగుప్తం: తమ గ్రామంలో నిర్వహిస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం పనులను వ్యవసాయానికి అనుకూలంగా ఉన్న చోట్ల నిర్వహించాలని కోరుతూ ఎంపీడీవో కె.వెంకటేశ్వర ప్రసాద్‌కు ఎస్.కొత్తపల్లి గ్రామస్తులు శనివారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఈదరపల్లి శ్రీను రాజు, వెంకట కృష్ణంరాజు, నడింపల్లి కొండరాజు, కడియం భైరవస్వామి, ఓలేటి తాతాలు, కుచ్చర్లపాటి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ సంపదరావు పరామర్శ

ఉప్పలగుప్తం: మండలంలోని గోపవరానికి చెందిన అయితాబత్తుల చిట్టెమ్మ శుక్రవారం మృతి చెందారు. ఆమె కుమారులు మాజీ సర్పంచ్ అయితాబత్తుల వెంకట కృష్ణారావు, రైతు సంఘం నాయకుడు ఉమామహేశ్వర రావు, పోలీసు ఉద్యోగి బాలకృష్ణ కుటుంబ సభ్యులను జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపద రావు, ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు శనివారం పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పరామర్శించిన వారిలో ఇసుకపట్ల రఘుబాబు, ఏడిద శ్రీను, సాకా రాంబాబు తదితరులున్నారు.

నేను బడికి పోతా అవగాహన ర్యాలీ



నేను బడికి పోతా అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎంఈఓ దుర్గాదేవి, ఉపాధ్యాయులు

అమలాపురం టౌన్: స్థానిక 30వ వార్డులో ఇందిరా గాంధీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 'నేను బడికి పోతా' కార్యక్రమంపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మేము బడికి పోతాం, బడి ఈడు పిల్లలు ఉండాల్సింది పనిలో కాదు బడిలో తదితర నినాదాలతో ఉన్న ప్లకార్డులను విద్యార్థులు ప్రదర్శించారు. అవగాహన ర్యాలీలో ఎంఈఓ ఎస్.దుర్గాదేవి, ఎంజీ కాంప్లెక్స్ చైర్మన్ బీఆర్ కామేశ్వరరావు, సీఆర్‌ఎంటీ ఎం.శ్రీనుబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి బడి ఈడు పిల్లలను గుర్తించారు.

11 కొత్త జీపులు, 133 బైక్‌ల కొనుగోలు

యానాం: పుదుచ్చేరివ్యాప్తంగా యాంటీ నార్కోటిక్ విభాగం ఉపయోగించడానికి వీలుగా పోలీస్ శాఖ రూ.2.50 కోట్లతో 11 కొత్త జీపులు, 133 బైక్‌లను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా శనివారం వాటిని సీఎం రంగసామి, హోంమంత్రి నమశ్శివాయం ప్రారంభించారు. ఈ వాహనాలను ప్రధానంగా శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్, రౌడీ నిరోధక విభాగం, మాదకద్రవ్యాల నిరోధక విభాగం ఉపయోగిస్తాయన్నారు. భవిష్యత్‌లో రూ.12 కోట్లతో 10 భారీ వాహనాలు, 47 తేలికపాటి మోటార్ వాహనాలు, 73 మోటార్ వాహనాల కొనుగోలుకు పోలీస్‌శాఖ ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. పోలీసు బలగాల కోసం ఆధునిక సమన్వయ కేంద్రాన్ని సైతం ప్రారంభించారు.

ప్రజలకు శుద్ధమైన తాగునీటిని అందించాలి



బోడసకుర్రులో సీపీడబ్ల్యూఎస్ స్కీమ్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ బొజ్జిరాజు

అల్లవరం: ప్రజలకు శుద్ధమైన తాగునీటిని సరఫరా చేయాలని, తాగునీటి నాణ్యతలో రాజీ పడొద్దని డీఎల్‌పీఓ బొజ్జిరాజు అన్నారు. మండలంలోని బోడసకుర్రు రక్షిత మంచినీటి చెరువుని శనివారం ఆయన పరిశీలించారు. బోడసకుర్రు ఓహెచ్‌ఆర్ నుంచి 36 ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌లకు తాగునీటి సరఫరా జరుగుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు డీఎల్‌పీఓకి తెలిపారు. అల్లవరం మండల పరిషత్ కార్యాలయంలో తాగునీటి నాణ్యతపై కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఎంపీడీఓ కృష్ణమోహన్ సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, ఏఈ స్వామి, వైద్యాధికారి స్పందన, ఎంఈఓ ఏడుకొండలు, కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

నీట్ మినహాయింపునకు తీర్మానం చేయాలి

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా మెడికల్ కోర్సులు నిర్వహించే నీట్ పరీక్షకు మినహాయింపునిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని సీఎం రంగసామిని ప్రతిపక్ష డీఎంకే నేత ఆర్.శివ కోరారు. శనివారం అసెంబ్లీ ప్రాంగణంలో సీఎం రంగసామిని కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటికే నీట్ నుంచి తమిళనాడుకు మినహాయింపునకు అక్కడి సీఎం స్టాలిన్ ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేశారన్నారు. ఈ విషయంలో పుదుచ్చేరి ప్రభుత్వం కూడా ముందుకు రావాల్సి ఉందన్నారు. అదేవిధంగా నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలపై ఇప్పటికే సుప్రీంకోర్టు సైతం కేంద్రానికి నోటీసు జారీ చేసిందన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల భవిష్యత్‌ను ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వి.అనిబాల్ కెనడీ, ఎల్.సంపత్, బి.మూర్తి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కేంద్ర కార్యాలయం కూల్చివేత దుర్మార్గం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రమణారావు

ఉప్పలగుప్తం: తాడేపల్లిలో ఉన్న వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయాన్ని దౌర్జన్యంగా కూల్చివేత దుర్మార్గమని అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు అన్నారు. చల్లపల్లి పంచాయతీ జగ్గరాజుపేటలో శనివారం రమణారావు స్వగృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్మాణంలో ఉన్న పార్టీ కార్యాలయ భవనాన్ని సీఆర్‌డీఏ అధికారులు అన్యాయంగా కూల్చివేయడం తగదన్నారు. చట్టాన్ని అతిక్రమించొద్దని హైకోర్టు సూచించినా దౌర్జన్యంగా కూల్చివేయడం దారుణమన్నారు. చంద్రబాబు కూటమి కక్ష పూరితంగా వ్యవహరిస్తుందన్నారు. చట్ట సభల్లో న్యాయబద్ధంగా వ్యవహరిస్తామని ప్రమాణం చేసి 24 గంటలు గడవకుండానే కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా చట్ట వ్యతిరేక విధానాలను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రజలు తిరగబడి బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని చెప్పారు.

విద్యుత్ చార్జీలు తగ్గించే యోచన

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా విద్యుత్ చార్జీలను పెంచుతూ జాయింట్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (జేఈఆర్‌సీ) తీసుకున్న నిర్ణయాన్ని తగ్గించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లుగా తెలుస్తుంది. ఈ మేరకు పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని జేఈఆర్‌సీకి ప్రభుత్వం శనివారం విజ్ఞప్తి చేసింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.700 కోట్ల రెవెన్యూ లోటును తగ్గించడానికి జేఈఆర్‌సీ విద్యుత్ చార్జీలను పెంచినట్లు చెబుతుంది. విద్యుత్ శాఖ దాఖలు చేసిన వినతి ఆధారంగా గృహ వినియోగానికి రూ.60 పైసల నుంచి రూ.75 పైసల వరకూ పెంపుదలకు జేఈఆర్‌సీ ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో సడలింపు కోసం ప్రభుత్వం ద్వారా సబ్సిడీ ఇవ్వడం, విద్యుత్ సరఫరా, కొనుగోళ్లలో అంతరాన్ని తగ్గించడం తదితర అంశాలపై ప్రభుత్వం యోచిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం వెంకటలక్ష్మి

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఫ్రీ టైం సర్వీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కూల్ డ్రింక్స్ తాగడం వల్ల కలిగే నష్టాలు, అనర్థాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండర్ తులా రాంబాబు మాట్లాడుతూ కూల్ డ్రింక్స్, జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఉదయాన్నే నువ్వుల ఉండ, గుడ్లు తినాలని వారానికి ఒకసారైనా వేప పుల్లతో పళ్లు తోముకోవాలన్నారు. అన్నింటికంటే ముఖ్యంగా స్మార్ట్ ఫోన్‌కి దూరంగా ఉంటూ ఆరు బయట ఆటలకు ప్రాధాన్యమివ్వాలని చెప్పారు. అనంతరం విద్యార్థులకు హైస్కూల్ హెచ్‌ఎం వెంకటలక్ష్మి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీఈటీ రమణారావు, ఫౌండేషన్ సెక్రటరీ కాశిన ఫణీంద్ర, సభ్యులు తులా సతీష్, మహేష్, దినేష్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు చర్యలు



సీఎల్‌జీ సమావేశంలో మాట్లాడుతున్న పుదుచ్చేరి ఎస్పీ సౌజన్య

యానాం: నియోజకవర్గ పరిధిలో మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని పుదుచ్చేరి ఎస్పీ ఎంవీఎస్‌వీ లక్ష్మీసౌజన్య పేర్కొన్నారు. శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఎల్‌జీ, పోలీస్ వెల్ఫేర్ సమావేశాల్లో ఆమె పాల్గొన్నారు. ముందుగా జరిగిన సీఎల్‌జీ సమావేశంలో గంజాయి వంటి మత్తుపదార్థాలకు యువత బానిసలు అవుతున్నారని పట్టణానికి చెందిన పలువురు ఎస్పీకి వివరించారు. గంజాయి అమ్మకాలు, వినియోగాన్ని పూర్తిగా అరికట్టేలా నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా ఈవ్‌టీజింగ్‌ను, దొంగతనాలను అరికట్టాలని, బాలలు, మహిళా సమస్యలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ సౌజన్య మాట్లాడుతూ మాదకద్రవ్యాలను అరికట్టేలా ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటుచేస్తామన్నారు. అదేవిధంగా మహిళా సమస్యలపై మహిళా డెస్క్‌ను ఏర్పాటుచేసి వాటి ద్వారా ఫిర్యాదులు స్వీకరించి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్పీ రాజశేఖరన్, ట్రాఫిక్ ఎస్ఐ శేరు నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు మోక్షం



శ్మశానవాటికలో తుప్పలు తొలగిస్తున్న ఉపాధి కూలీలు

మామిడికుదురు: తుప్పలతో పూర్తిగా మూసుకుపోయి అడవిని తలపిస్తున్న అప్పనపల్లి శ్మశాన వాటికను గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలు శుభ్రం చేశారు. శ్మశాన వాటికలో విపరీతంగా పెరిగిపోయిన తుప్పలు, డొంకల్ని సమూలంగా తొలగించారు. శ్మశాన వాటికలో డొంకలు విపరీతంగా పెరిగిపోయి ఎవరైనా చనిపోయిన సందర్భాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ గ్రామస్తులు ఇటీవల ఆగ్రహం వ్యక్తం చేయడంతో అధికారులు స్పందించి చర్యలు తీసుకున్నారు. శుక్రవారం, శనివారం రెండు రోజుల పాటు ఒక్కో రోజు 36 మంది కూలీలు వంతున శ్మశాన వాటికలో పని చేశారు. తద్వారా శ్మశాన వాటికను తీర్చిదిద్దారు. దీనిపై స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



నల్లచెరువులో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసియున్న శ్రీశ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయాలు శనివారం భక్తులతో క్రిక్కిరిసిపోయాయి. చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్సిపూడి, జొన్నాడ గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తపారవశ్యం చెందారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

కొర్లపాటివారిపాలెంలో...

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన వేంకటేశ్వర స్వామి వారి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. తొలుత స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితులు ఆధ్వర్యంలో తెల్లవారు జామున పలు పూజలు చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు.

పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా జ్యూట్ బ్యాగుల ఉత్పత్తి



శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న నాబార్డు ఏజీఎం సోమునాయుడు

మలికిపురం: పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా జ్యూట్ బ్యాగుల తయారీని నాబార్డు ప్రోత్సహిస్తుందని నాబార్డు ఏజీఎం వై.సోము నాయుడు పేర్కొన్నారు. నాబార్డు వారి సహకారంతో ఆక్సిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీవనోపాధి ఆధారిత శిక్షణ కార్యక్రమం భాగంగా జ్యూట్ బ్యాగుల ఉత్పత్తుల శిక్షణను మూడు గ్రామాలకు కలిపి మండలంలోని కేశనపల్లి గ్రామాల్లో శనివారం ప్రారంభించారు. కార్యక్రమానికి ఆక్సిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు కటికిరెడ్డి గంగాధరం అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాబార్డు ఏజీఎం వై.సోము నాయుడు ప్రారంభించి మాట్లాడుతూ పర్యావరణ అనుకూలమైన జ్యూట్ ఉత్పత్తి తయారీ చాలా అవసరం అని, 90 మహిళలకు 20 రోజుల పాటు కేశనపల్లి, పడమటిపాలెం, గూడపల్లి గ్రామాల మహిళలకు శిక్షణ జరుగుతుందని, ఈ అవకాశాన్ని లబ్ధిదారులు ఉపయోగించుకోవాలన్నారు. బాగా శిక్షణ తీసుకుని ఆర్థికంగా పారిశ్రామికవేత్తలుగా తయారు కావాలని దిశా నిర్దేశం చేశారు. మరో ముఖ్య అతిథిగా జిల్లా డీఆర్‌డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి నూతనంగా యూనిట్లు పెట్టుకోవడానికి ప్రభుత్వం నుంచి అన్ని సహకారాలు అందిస్తామని తెలియజేశారు. జ్యూట్ బ్యాగుల ఉత్పత్తి స్థానిక ట్రైనర్ తోట ఉమ మహేశ్వరి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో జ్యూట్ బ్యాగ్స్ ట్రైనింగ్ పెట్టడం మహిళలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మూడు గ్రామాలకు చెందిన డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

గోశాలకు ఎండు గడ్డి వితరణ



అంతర్వేది గోశాలకు ఎండుగడ్డి వితరణ చేసిన వారితో ఏసీ సత్యనారాయణ

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానం పరిధిలోని గోశాలకు పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం మండలం పి.వేమవరానికి చెందిన నామన నాగేశ్వరరావు, కుటుంబ సభ్యులు కలిసి రూ.25 వేలు విలువైన రెండు ట్రాక్టర్ల ఎండుగడ్డిని శనివారం వితరణ చేశారు. ఈ మేరకు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ సమక్షంలో గోశాల సిబ్బందికి ట్రాక్టర్ల గడ్డిని అందజేశారు. కాగా ఆలయంలో వారికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామి లడ్డు ప్రసాదాలను దేవస్థానం సిబ్బంది అందజేసింది.

వైభవంగా దుర్గామల్లేశ్వర స్వామి కల్యాణం



బి.సావరంలో నిర్వహించిన కల్యాణం

కొత్తపేట: స్థానిక బొరుసువారి సావరంలో వేంచేసిన విజయ కనకదుర్గాదేవి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం, దుర్గామల్లేశ్వరస్వామి దివ్యతిరు కల్యాణ మహోత్సవం కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ నెల 20 నుంచి ఆలయ వార్షికోత్సవ కార్యక్రమాలు ప్రారంభం కాగా శుక్రవారం రాత్రి కళ్యాణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సుమారు 30 మంది దంపతులు కన్యాదాతలుగా నిలిచి కల్యాణం జరిపించారు. ప్రదానం నుంచి తలంబ్రాల వరకూ ప్రతీ కార్యక్రమాన్ని పండితులు ఆ దంపతులతో చేయించారు. బ్రహ్మశ్రీ అనంత లక్ష్మణకుమారాచార్యులు కల్యాణ వ్యాఖ్యానం విశేషంగా ఆకట్టుకుంది. ముఖ్యంగా కన్యాదాన ఫలితాన్ని వివరించారు. ఆడపిల్ల వివాహ సమయంలో కన్యాదానం చేయడం అనేది పూర్వజన్మ పుణ్య ఫలమని, ఇది ఎంతో మంచి ఫలితాలను ఇస్తుందని వివరించారు. కల్యాణంలో పాల్గొన్న దంపతులు స్వామి, అమ్మవారికి మ్మవారికి పట్టు మధుపర్కాలు, కల్యాణ మాలలు సమర్పించారు. కొత్తపేట పరిసర ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 54 మందికి ఉద్యోగాలు



కొత్తపేట జాబ్ మేళాలో ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ డాక్టర్ పెద్దిరాజు తదితరులు

కొత్తపేట: విద్యార్థి దశ నుంచి ఉద్యోగ జీవితంలో అడుగుపెడుతున్న మీరు ఆయా కంపెనీల్లో ఉత్తమ ఉద్యోగులుగా యాజమాన్యాల మన్ననలు పొంది ఉన్నత స్థాయికి చేరుకోవాలని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు సూచించారు. స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఆ కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్ (జేకేసీ), వికాస సంయుక్త ఆధ్వర్యంలో 300 పైగా ఉద్యోగాలకు జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు 283 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో తమ పేర్లు రిజిస్టర్ చేసుకోగా 213 మంది హాజరయ్యారు. వారిలో 54 మంది ఎంపిక కాగా వారిని ప్రిన్సిపాల్ అభినందిస్తూ జాబ్ ఆఫర్ లెటర్స్ అందజేశారు. మరో 59 మంది విద్యార్థులు సెకండ్ రౌండ్ ఇంటర్వ్యూకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, జేకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ జి.శ్రీనివాసులు, మెంబర్ డి.కావ్య, అధ్యాపకులు అంకమరావు, పాపారావు, వికాస ప్రతినిధులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

అయినవిల్లి: మండలంలోని తొత్తరమూడిలోని కొడవటివారి లంకకు చెందిన ఓ యువకుడు అమలాపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. దీనికి సంబంధించి ఎస్సై వి.రాజేష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లి మండలం తొత్తరమూడిలోని కొడవటివారిలంకకు చెందిన వంత్రపాటి వీరవెంకట సత్యనారాయణ (25) ఈ నెల 20న తనకు పెళ్లికావడం లేదని మనస్తాపంతో పురుగుమందు తాగాడు. అతడిని బంధువుల చికిత్స కోసం అమలాపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ వీరవెంకట సత్యనారాయణ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. దీనిపై మృతుడి సోదరుడు వీరన్న ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం గ్రామాలకు ఆదివారం ఆరు గంటలు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు శనివారం అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవిబాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. ఈ సమయంలో విద్యుత్ లైన్ వద్ద చెట్ల కొమ్మలు, ఆకుల తొలగింపు పనులు చేపడతామన్నారు. అలాగే మరమ్మతులు చేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.